

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కేంద్రాల మార్పు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలానికి సంబంధించిన ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల పరిధులను మార్పులు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు కొత్తపేట ఐసిడిఎస్ సిడిపిఒ పి.శారద తెలియజేశారు. శనివారం ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు కపిలేశ్వరపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని మండపేట ప్రాజెక్టు పరిధిలోకి తరలించారన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం పాలనాపరమైన సౌలభ్యం కోసం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలను మార్పు చేశారన్నారు. దీంతో ఆలమూరు మండలంలోని 76 అంగన్‌వాడీ కేంద్రాలను కొత్తపేట కేంద్రంగా ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోకి తరలించారన్నారు. ప్రస్తుతం కొత్తపేట కేంద్రంగా ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలు ఉండగా నూతనంగా ఆలమూరు మండలాన్ని చేర్చారన్నారు. దీంతో మొత్తం ఐసిడిఎస్ పరిధిలో 285 అంగన్‌వాడీ కేంద్రాలకు పెరిగాయన్నారు.

మందకొడిగా 'జలజీవన్' పనులు

ప్రజాశక్తి-మండపేట

ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్‌మిషన్ కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో ప్రభుత్వం ప్రారంభించింది. నియోజకవర్గంలో మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో 43 గ్రామ పంచాయతీలు ఉండగా 20 హేమ్లెట్ పంచాయతీలలో జలజీవన్‌మిషన్ పనులు మందకొడిగా జరుగుతున్నాయి. రూ.34.33 కోట్ల రూపాయలతో రాయవరంలో 20,264, మండపేటలో 18,762, కపిలేశ్వరపురంలో 18,678 కుళాయిలు అందించడమే 2024కి నాటికి లక్ష్యంగా పనులు మొదలు పెట్టారు. దీనిలో భాగంగానే 10 శాతం పబ్లిక్ కాంట్రిబ్యూషన్‌తో కుళాయిలు మరమ్మతులు చేపడుతారు. ఇందుకోసం 78 పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మండపేట మండలంలోని తాపేశ్వరం శివారు పేకేరుపేటలు, మారేడుబాక, ఏడిద శివారు కొత్తూరు, సీతానగరం, ద్వారపూడి శివారు చిన ద్వారపూడి, కపిలేశ్వరపురం మండలంలో అచ్యుతాపురం శివారు సత్యనారాయణపురం, అచ్యుతాపురం వల్లూరు, అంగర, నేలటూరు. రాయవరం మండలంలో నదురబాద, సీతంపేట, రెడ్డి కృష్ణపేట, నరాలవారిపాలెం, చొల్లంగిపేట నరాలవారిపేటలలో పనులు జరుగు తుండగా ఇప్పటికే సత్యనారాయణపురం, చెల్లూరు బుట్టాయిపేట, బత్తులవారిమాలపల్లిలలో పనులు పూర్తిఅయ్యాయి. అయితే ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో కొన్ని గ్రామాల్లో పనులు నిలిచిపోగా



జలజీవన్‌మిషన్ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

మరికొన్నిచోట్ల మందకొడిగా జరుగుతున్నాయి.

17 గ్రామాల్లో పనులు పూర్తి

ఈ విషయంపై గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ డిఇ, ఎ.జి రామారావును వివరణ కోరగా ఇప్పటికి వరకు 17 గ్రామాల్లో 17 పనులు పూర్తి అయ్యాయని సుమారుగా రూ.5 కోట్ల మేరా కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సి ఉందన్నారు.

2024కి లక్ష్యం పూర్తయ్యేనా?

మరో ఐదు నెలలలో లక్ష్యం పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడం తదితర కారణాల నేపథ్యంలో పనులు ముం దుకు సాగడంలేదు. 2024కి పూర్తి కాకపోవచ్చునని పలువురు అంటు న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన బిల్లులు చెల్లించి ప్రతి ఇంటికి తాగునీరు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అందరి సహకారంతోనే జనాభా నియంత్రణ

ప్రజాశక్తి-అమలాపురం

అందరి సహకారంతోనే జనాభా నియంత్రణ సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రపంచ జనాభా దినోత్సవం- 2023 కార్యక్రమాన్ని డిఆర్‌ఒ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల స్థిరమైన వ్యవసాయ పద్ధతులను కొనసాగిస్తూ ఆహారం కోసం పెరుగుతున్న డిమాండ్ లు తీర్చడంలో ఇది పెద్ద సవాలుగా మారుతుందని తెలిపారు. పెరుగుతున్న జనాభా ప్రపంచ ఆహార ఉత్పత్తి వ్యవస్థపై ఒత్తిడి తెచ్చి, ఆహార కొరత, పోషకాహార లోపం, ఆకలి సమస్యలను కలిగిస్తుందన్నారు అధిక జనాభా విస్తృతమైన పట్టణీకరణకు దారితీసిందన్నారు. సరైన మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం ప్రజారోగ్యం, శ్రేయస్సుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. పెరుగుతున్న జనాభా సహజ వనరులపై విపరీతమైన ఒత్తిడిని కలిగిస్తుందని. అటవీ నిర్మూలన, నీటి కొరత పెరుగుతున్న జనాభాకు తగిన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించడం కష్టతరమవుతోందన్నారు. జిల్లాలో ఇపిఐయుసిడి విధానాలను రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రి చెందిన డాక్టర్ బి.వీరభద్రుడు 202 మంది చేత అవలంబింప చేయించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని అన్నారు. ఆయనకు ప్రోత్సాహంగా ఎన్‌హెచ్‌ఎం నిధుల ద్వారా రూ.7000 బహుమతిగా అందించామన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి



ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

వైద్యులు జెబి మౌనిక పిపియుసిడి విధానాన్ని 109 మంది చేత అవలంబింపజేసి రెండో స్థానంలో నిలిచారని వీరికి ప్రోత్సాహంగా రూ.5000 అందించామన్నారు. వేసక్టమీ శస్త్ర చికిత్సలు నిర్వహణలో అత్యధిక పిహెచ్సి వైద్యులు డాక్టర్ ఎం.దుర్గాప్రసాద్ ఏడు నిర్వహించి మొదటి స్థానంలో నిలిచారని వీరికి రూ.4వేలు ప్రోత్సాహకం అందించామన్నారు. పిపియుసిడి కుటుంబ నియంత్రణ పద్ధతులు చేయించుకున్న వారిని డిఆంఒ లక్కీ డ్రా తీయగా స్థానిక మండల పరిధిలో జనుపల్లికి చెందిన సి.అశ్విని, రామచంద్రపురం మండలం ముచ్చుమిల్లికి చెందిన లంక లక్ష్మి ఎంపికయ్యారన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున ప్రోత్సాహకాలు అందించామన్నారు. జిల్లాలో బెస్ట్ ఎఎన్ఎం, ఇద్దరు బెస్ట్ ఆశ వర్కర్లు ఇద్దరిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున ప్రోత్సాహకాలు అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర తదితరులు పాల్గొన్నారు.

కిలో.46 కే సూపర్ ఫైన్ బియ్యం

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ప్రజలకు సూపర్ ఫైన్ రకం బియ్యం కిలో రూ.46 కే అందివ్వాలనే ఉద్దేశంతో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లో అందుబాటులోకి తెచ్చామని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి అన్నారు. స్థానిక రైతు బజార్లో శనివారం ఏర్పాటు చేసిన సూపర్ ఫైన్ బియ్యం స్టాల్ ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట మార్కెట్లో ఈ రకం బియ్యం రూ.65 నుంచి రూ.70 వరకూ ఉందన్నారు. అదే బియ్యాన్ని సామాన్యులకు సైతం అందివ్వాలనే ఉద్దేశంతో కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు



రైతు బజార్లో సూపర్‌ఫైన్‌బియ్యం విక్రయిస్తున్న దృశ్యం

రైతుబజార్లో స్టాల్ ను ప్రారంభించామని, త్వరలో పట్టణంలో మరో స్టాల్ ను ఏర్పాటు చేయనున్నట్టు పట్టాభిరామయ్య చౌదరి తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎస్ఒ సుబ్బరాజు, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ బోళ్ల సతీష్, కోళ్ళ శ్రీనివాస్, బత్తిన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు

ప్రజాశక్తి-రాజోలు

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో నిర్వహిం చిన చంద్రయన్-3 ప్రయోగం విజయవంత కావడంపై శని వారం మలికిపురం మండలం విశ్వేశ్వరపురంలోని 'వివేకానంద' పాఠశాలలో విజయోత్సవ సంబ రాలు జరిపారు పాఠశాల కరస్పా ండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న



వివేకానంద పాఠశాల విద్యార్థుల సంబరాలు

చంద్రయాన్ త్రీ ప్రయోగం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు విజయానికి కారణమైన శాస్త్రవేత్తలు బందానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జయహో ఇస్రో అంటూ జయహో భారత్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చంద్రయాన్ ప్రయోగం వివరాలను వివరించారు.

జగనన్న లేఅవుట్లో రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పల్లిపాలెం జగనన్న లేఅవుట్లు ప్రాంతాన్ని సిపిఎం బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుంటున్న వారు రోడ్లు సరిగా లేకపోవడంతో ఇల్లు నిర్మాణం సంబంధించి మెటీరియల్ చేరవేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షం పడితే ట్రాక్టర్లు, ఆటోలు కూడా రావడం లేదని దాని కారణంగా ఇల్లు నిర్మాణాలు ఆగిపోయాయని అన్నారు. పాలకులు అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్లు నిర్మాణం చేస్తే త్వర త్వరగా ఇల్లు నిర్మాణాలు జరుగుతాయని సిపిఎం నాయకులు జి.దుర్గా ప్రసాద్, పాము బాలయ్య అన్నారు. లే అవుట్లు చేసినప్పుడే రోడ్లు నిర్మాణం బాగా చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని కనీసం ఆటో కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అధికారులు స్పందించి ఇల్లు



పల్లిపాలెం జగనన్న లే అవుట్‌ను సందర్శించిన సిపిఎం బృందం

నిర్మాణం చేసుకునే వారికి ఇబ్బందులు లేకుండా చేయాలని అన్నారు.కార్యక్రమంలో జడ నాగేశ్వరరావు, సత్యనారాయణ, విజయ్ ఉన్నారు.



కుడిపూడిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

పెండింగ్ జీతాల విడుదలపై హర్షం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నందు ఔట్సోర్సింగ్‌లో టెక్నికల్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న తమకు 9 నెలలుగా పెండింగ్ లో ఉన్న జీతాలు విడుదలయ్యాయని శనివారం తెలిపారు. అయితే 9 నెలలుగా జీతాలు లేక తాము ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ విషయాన్ని సెంట్రల్ డెల్టా బోర్డు ఛైర్మన్ కుడిపూడి బాబు ఇటీవల సిఎం దృష్టికి తీసుకెళ్లి రిప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. ఆయన స్పందించి జీతాలు విడుదల చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా వారు సిఎం జగన్‌కు, కుడిపూడి బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మణిపూర్‌లో దాడులకు నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

కొద్దిరోజులుగా 'మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుచున్న దాడులకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కోనసీమ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవకులు, క్రైస్తవ విశ్వాసులు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. దాడులను అరికట్టే విధముగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

కార్టూన్'నిజం'



'జగనన్న సురక్ష'లో ధృవీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో శనివారం పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అర్హులకు ధృవపత్రాలు అందజేశారు. వివరాలు ఇవి..

కపిలేశ్వరపురం జగనన్న సురక్ష పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత సేవలు అందిస్తుందని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి లో గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట పాల్గొని ప్రసంగించారు. ఈ సురక్ష పథకం లో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తారన్నారు. అనంతరం వివిధ ధృవ పత్రాలను అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ మూర్తి, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పా ల్గొన్నారు.

అమలాపురం అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయితీ పరిధిలో 22న జరిగే జగనన్నసురక్ష సంబంధించి శనివారం నుంచి క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభం చేయడమైనది. ఫీల్డ్ లో సర్వే జరుగుతున ఏరియాలలో గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొని ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు తెలియజేసి వాలంటీర్లు చేయుచున్న సర్వేలను పరిశీలించారు. **ఉప్పలగుప్తం** అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరం వంటిదని ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. శనివారం గోపవరం, కూనవరం గ్రామాల్లో సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, వాకపల్లి ఈశ్వరిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలలో ఎంపిపి అచ్యుత జానకి ముఖ్యఅతిథిగా హాజరై జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఆయా ధవీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎంపిపి అందజేశారు. కార్యక్రమాలలో ఎంపిటిసి సభ్యులు కొంకి ఏడుకొండలు, కాట్రు ధనలక్ష్మి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సొసైటీ అధ్యక్షులు ఊటాల రామాంజనేయులు, తహశీల్దార్ జె.వెంకటేశ్వరి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

రామచంద్రపురం కుల ధ్రువీకరణ పత్రాలు లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారని, పింఛన్లకు తిప్పలు తప్పడం లేదని తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని రామచంద్రపురం తహశీల్దార్ తేజేశ్వర్‌రావుకు బేడబుడగ జంగాలు వినతి పత్రం సమర్పించారు. తాళ్లపాలెం గ్రామంలో గల బేడ బుడగజంగాలు పడుతున్న బాధలను వివరించి, ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రం లో కోరారు.



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఉప్పలగుప్తం ఎంపిపి అచ్యుత జానకి

కార్యక్రమంలో జిల్లా బేడ బుడగజంగం అధ్యక్షులు పేర్ల దుర్గాప్రసాద్, పేర్ల శేఖర్ , మోటూరి కపానందం,ఉప్పు అంతర్వేది, కిన్నెర వెంకన్న, మహిళలు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో వినతిపత్రం అందజేస్తున్న బేడబుడుగజంగాలు

ఘనంగా దుర్గాబాయ్ దేశ్ ముఖ్ జయంతి

ప్రజాశక్తి-మండపేట

స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సంస్కర్త దుర్గా భాయ్ దేశ్ ముఖ్ జయంతిని స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యంబ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా భాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి స్వాతంత్ర్య పోరాటంలో ఆమె చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్. పి శేషారత్నం మరియు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల వెరిఫికేషన్‌కు సహకరించాలి

ప్రజాశక్తి-మండపేట

ఓటర్ల వెరిఫికేషన్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించి బూత్ ఏజెంట్లను నియమించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్ అన్నారు. శనివారం తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్ని ప్రధాన పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ మార్పు చేర్పులపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలన్నారు. టిడ్కో ఇళ్లలోకి లబ్ధిదారులు ప్రస్తుతం తాము ఉంటున్న ఇళ్లు ఖాళీ చేసి వెళ్లినందున ఆయా వార్డుల్లో వారి ఓట్లు తొలగించి టిడ్కో అడ్రస్‌కు మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు సీతారామ కమ్యూనిటిహాలులో బిఎల్వోలు, సచివాలయ కార్యదర్శులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక డోరు నెంబరుతో అధిక ఓట్లు ఉంటే పూర్తిగా నిర్ధారణ చేసుకోవాలన్నారు. డోరు నెంబర్లు తప్పులు లేకుండా సరిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దారు రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ టి.రామకుమార్, వివిధ పార్టీలకు చెందిన ఉంగరాల రాంబాబు, మేడపాటి రవీంద్రరెడ్డి, ఎన్నికల డిప్యూటి తహశీల్దారు మెహర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు పంచాయతీ పరిధిలోని చిట్టమ్మ చెరువు నుంచి ఎమ్మెస్ఎన్ కాలనీ వరకు వేస్తున్న బి టి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ నక్కఅరుణ కుమారి శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మంత్రి విశ్వరూప్ సహకారంతో రూ.కోటితో ఎఐఐబి నిధుల నుంచి ఈ రోడ్డు నిర్మించారన్నారు. అమలాపురం పట్టణానికి అనుకోని ఉండి కామనగరువు పంచాయతీ ఏర్పడిన తర్వాత ఇంచు మించు చాలాకాలం నుంచి ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సర్పంచ్ చొరవతో మంత్రి విశ్వరూప్ సహక రించ డంతో ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేశా రని ప్రజలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట తదితరులు

ఏడిద గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మండపేట

అనేక అభివృద్ధి కార్యక్రమాలతో ఏడిద గ్రామాబివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించిన పలు అభివద్ధి పనుల శంకుస్థాపన, ప్రాంభోత్సవ కార్యక్రమాల్లో ఎంఎల్‌సి తోట ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో విఆర్‌ఒల సౌకర్యం నిమిత్తం నిర్మించనున్న భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన అర్చకుల వసతి గహాన్ని ఆయన ప్రారంభించి గహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కుడిపూడి భవాని, వైస్ ఎంపిపి పసుమర్తి నాగబాబు, వైసిపి గ్రామ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఏడిద సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీహరి, చిలుకూరి బుజ్జి, పంచాయితీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఆందోళన

ప్రజాశక్తి- రాజోలు

ప్రభుత్వం నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.50 వేల కోట్లు భారం మోపిందని జనసేన నాయకులు విమర్శించారు. శనివారం రాజోలు జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాజోలు విద్యూత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయుకులు డాక్టర్ రాపాక రమేష్ బాబు, తాడి మోహన్, బొంతు రాజేశ్వరరావు, గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహలక్ష్మి, పినిశెట్టి బుజ్జి, మత్తి జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



సారే తీసుకువస్తున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, వేణుగోపాలకృష్ణ తదితరులు

భీమేశ్వరాలయంలో సారె సమర్పణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ శనివారం ఆషాఢం సారే సమర్పించారు. ఆలయ వేద పండితులు మొదటిసారిగా అమ్మవారికి శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. మంత్రులు కొట్టు సత్యనారాయణ, వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిలుగా పాల్గొని మాణిక్యాంబ అమ్మవారికి సారె సమర్పించారు. మంత్రులకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న కార్యక్రమాలు వివరాలను దేవాదాయ శాఖ మంత్రి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్య అన్నదాన ట్రస్టుకు శనివారం దేవరపల్లి వాసులు మారుమాకుల మౌనిక పుట్టినరోజు అన్నదానం జరిపించేందుకు చిన్నారి తల్లిదండ్రులు రూ.17,501 విరాళం అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. దాతకు ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ మరియు సభ్యులు



దాతకు చిత్రపటంఅందిస్తున్న ఛైర్మన్

స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆలయం నకు శనివారం వివిధ టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.1,69,900, నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.79,251 మొత్తం రూ.2,49,151 ఆదాయం వచ్చిందని ఎసి తెలిపారు. 3,369 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 2,984 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.



వానపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న కొత్తపేట ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డి

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -కొత్తపేట

వైసిపి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయనిప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో గడప.. గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతీ ఇంటికీ వైసిపి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేసి పథకాలు అందడంలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. అధికారులకు సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు కార్యక్రమంలో ఎంపిపి మార్గాని గంగాధర్ రావు, గొల్లపల్లి డేవిడ్ రాజ్, గుడపాటి రమాదేవి, బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కపిలేశ్వరపురం కుల, మత, పార్టీలకతీతంగా ప్రజా సంక్షేమ ధ్యేయంగా జగనన్న పాలన అందిస్తున్నారని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం కపిలేశ్వరపురం మండలంలోని టేకి లో నిర్వహించిన మూడవ రోజు ఆయన గ్రామంలో పర్యటించారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ మూర్తి, వైసిపి గ్రామ అధ్యక్షులు కుక్కల బాలయ్య ఎంపిడిఒ ఎం.రామకష్ణారెడ్డి తదితరులు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పలుచోట్ల విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

శనివారం ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు పలు దుకాణాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి విజిలెన్స్ ఎస్.పి. కె.కుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలాపురం మండలం చిట్యాలలో శ్రీ భవాని ఎంటర్ప్రైజెస్ ఎరువుల దుకాణంలో స్టాక్ వ్యత్యాసం ఉండడంతో షాపు యజమానిపై 6-ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సుమారు రూ.53,000 విలువైన 4.450 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి పి.ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ రమేష్, తహశీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-రాజమచంద్రపురం

కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 117 బీర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని సాపిరెడ్డి వీర వెంకట సతీష్ మణికంఠ, పెమ్మిరెడ్డి శివశంకర్ వర ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఎక్సైజ్ శాఖ సిఐ కె.వీరబాబు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో శనివారం ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ విస్తృత దాడులు నిర్వహించారు. మేర్లపాలెం శివారులో తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కాజులూరు

ట్రిపుల్ ఐటికి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పూజిత సత్య సాయి (నూజివీడు), కుసుమవల్లి, మొగులూరు వరప్రసాద్, మొండి లోవ సురేష్ (శ్రీకాకుళం) సెంటర్లకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంపిపి మాత భారతి మురళి, జెడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు కె.వివేకానంద, పి.జాన్ అభినందించారు.

వేగవంతంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -కరప

గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతంగా చేయిస్తున్నట్టు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జెడ్.భావారం, కొరిపల్లె, నడకుదురు, జి.భావారం, తదితర గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు డ్రైనేజీ పూడికతీతలను తీయించి ముగ్గు, బ్లీచింగ్ వంటి పౌడర్లను చల్లించామన్నారు.

ఇంటింటికీ టిడిపి మినీ మేనిఫెస్టో

ప్రజాశక్తి-కాకినాడ

టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తెలిపారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో భవిష్యత్తు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను చంద్రబాబుతో ఆవిష్కరింప జేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మినీ మేనిఫెస్టో పథకాలను వివరించాల్సిందిగా చంద్రబాబు ఆదేశించారన్నారు. ప్రస్తుత వైసిపి పాలనలో అన్ని రకాల నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు బతకడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

అభివృద్ధి సంక్షేమాలే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం టిడిపిని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ఎస్.అచ్యుతాపురంలో వస్తున్నా మీ గ్రామానికి మీ అనంతలక్ష్మి కార్యక్రమంలో అనంతలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అభివద్ధితోపాటు సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించారనానరు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ధరలన్నీ ఆకాశాన్ని అంటాయన్నారు. అభివద్ధి ఎక్కడా జరగలేదని ప్రజల వాపోతున్నారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకటరాజు, సరిదే నాగ హరినాథ్, కోనాల కృష్ణ, నూకల ఉదయ భాస్కర్, వెలుపుకొండ రాంబాబు, లావేటి శ్రీను, కొఠారి తిరుమల రావు, గుండ్రోజు శ్రీనివాస్, గౌతు సూర్యనారాయణ, చింతపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

రిఫ్రెషర్ కోర్సు విజయవంతం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒక వారం నిర్వహించిన 'పబ్లికేషన్స్, ప్రాజెక్ట్స్ అండ్ పేటెంట్స్' ఆన్‌లైన్ షార్ట్ టెర్మ్ రిఫ్రెషర్ కోర్సు విజయవంతమైనట్టు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎన్ఐటిలు, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వివిధ వనరుల వ్యక్తులు ప్రచురణలు, ప్రాజెక్టు మరియు పేటెంట్ల ప్రాముఖ్యతపై ఉపన్యాసాలు ఇచ్చారన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన రెడ్డి మాట్లాడుతూ, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లతో సహా మొత్తం 140 మంది ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని మరియు పరిశోధన మరియు అభివృద్ధి విభాగంలో జ్ఞానాన్ని పొందారని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక14 వ వార్డు చల్లా వారి గరువు కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి, మున్సిపల్ డిఇ ఆదినారాయణరావు, మున్సిపల్ ఎఇ కృష్ణ జీవ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్, తాటికొండ పెదకాపు, బద్ది వీరబాబు పాల్గొన్నారు.

తొలకరి పనులతో కళకళ..

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

తొలకరి వర్షంతో జిల్లాలోని వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొంత కాలంగా చినుకు జాడ కోసం నిరీక్షించిన రైతులకు తాజా వర్షాలు ఊరటనిచ్చాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 2.50 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిలో అత్యధికంగా 2 లక్షల ఎకరాలు వరి సాగు జరగనుంది. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సాగుకు రూపొందించిన కార్యచరణలో ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు జూన్ ఒకటి నుంచి నీరు విడుదల చేసినప్పటికీ రైతులు ముందస్తు సాగుకు వెనకడుగు వేశారు. సాంప్రదాయంగా తొలకరి వర్షం కోసం ఎదురు చూశారు. జలవనరుల శాఖ అధిదకారులు నీరు విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంతాలకు ఇప్పటికీ నీరు చేరలేదు. కాల్వల పూడికతీత, ఆధునీకరణ (క్లోజర్) పనులు చేపట్టకపోడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. వ్యవసాయ రంగంలో నీటి వనరుల నిర్వహణే కీలకమైనది. అటువంటి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించటంలో అనుసరించిన నిర్లక్ష్యం చిత్తశుద్దిని దర్పణం పడుతోంది. వర్షాలు ప్రారంభమైన అనంతరం కేవలం 17 కోట్లు కేటాయించటం విమర్శలకు దారి తీస్తోంది. కేటాయించిన నిధులు తూటుకాడ తొలగించాలని పేర్కొని ఆధునీకరణను పూర్తిగా అటకెక్కించిన వైనం రైతులను, రైతు సంఘాలను ఆందోళనకు గురి చేసిందనే చెప్పాలి. ఖరీఫ్ ఆలస్యానికి ప్రభుత్వమే కారణమని పలువురు అంటున్నారు.



ప్రహసనంలా సబ్సిడీ టమోటా

ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ టమోటా ప్రహసనంలా మారింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను నిలువరించేందుకు సబ్సిడీ టమోటా పంపిణీ ప్రారంభించింది. ఈ పంపిణీ జిల్లా కేంద్రంలోనే అస్తవ్యస్తంగా మారడం కొనుగోలుదారులను కలవరానికి గురి చేస్తోంది. ఎంపిక చేసిన కొన్ని రైతు బజార్లలో సబ్సిడీ టమోటా విక్రయాలు జరుగుతున్నాయి. ఆధార్ కార్డు నమోదు చేసుకుని అక్కడి అధికారులు కేజీ రూ.10 చొప్పున పంపిణీ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఇప్పటికీ కేజీ రూ.140 ధర ఉంది. ధరతో పోల్చితే కొంత ఊరట లభించిన మాట వాస్తవమేనని చెబుతున్న కొనుగోలుదారులు కేజీ టమోటా కోసం గంటపాటు క్యూలో నిలబడుతున్నామని వాపోతున్నారు. కొన్నిసార్లు కొద్ది మందికి మాత్రమే పంపిణీ చేసి స్టాకు లేదనే బోర్డులు పెట్టడం విస్మయానికి గురి చేస్తోంది. దీంతో ఉదయం నుంచే రైతు బజార్ల వద్ద భారీ క్యూ దర్శనమిస్తోంది. టమోటా సంగతి మినహాయిస్తే ఇతర కూరగాయలు సైతం ఇప్పటికీ ధరలు అందుబాటులోకి రాలేదు. వంకాయలు, బెండకాయలు, చిక్కుడు కాయలు తదితర ఏరకమైనా రూ.50 పై మాటే. ఆకు కూరలు కట్ట రూ.10 చేరడంతో కొనుగోలు దారులకు చుక్కలు కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 36 గంటల పాటు ఈ ఆందోళనలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాలలోని కలెక్టరు, సబ్ కల్టెరు కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించటంతో పాటు భారీ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ఆందోళనలపై ప్రభుత్వంస్పందించలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో వందలాది మంది అంగన్వాడీలు కదం తొక్కారు. అంగన్‌వాడీలకు మద్దతుగా పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు వెంటనడిచాయి. పాలక ప్రభుత్వాలకు హెచ్చరిక చేశాయి.

గోదావరికి వరద నీరు

ఎగువ రాష్ట్రాలో కురిసిన వర్షాలతో గోదావరి నదికి క్రమ క్రమంగా వరద నీరు చేరుతోంది. గతేడాది ఇదే నెలలో ప్రమాద ఘంటికలు మోగిన విషయం విదితమే. ప్రస్తుతానికి ఆ స్థాయిలో వరద లేనప్పటికీ గత అనుభవాలను గుర్తు చేసుకుని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. తాజాగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 8.75 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తుందనే సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బ్యారేజీ వద్ద ఉన్న 175 గేట్లలో 48 గేట్లు ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తోంది. మరో వైపు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజమహేంద్రవరంలో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాబోయే రోజుల్లో గోదావరి వరద నీరు పెరిగితే వర్షపు నీరు నదిలోనికి విడుదల చేసే అవకాశాలు తక్కువే. అధికారులు ఇప్పటికైనా అప్రమత్తమై సైడ్ డ్రయిన్‌లు పూడిక తీత పనులు వేగవంతం చేసి ముంపునుంచి రక్షించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పంట కాలువ కాదు కెనాల్ రోడ్డే..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



రోడ్డులో నీటి ప్రవాహంలో వాహనాలు

జిల్లాలో అత్యంత ప్రాధాన్యత గల సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డు దుస్థితి ఇలా మారిపోయింది. సామర్లకోట మండలం వికె.రాయపురం - మాధవపట్నం గ్రామాల మధ్య కాకినాడ మెయిన్ రోడ్డుపై వర్షాలుకు తోడు వరద జలాలు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి కాలువల్లో జలాలు అధిక స్థాయిలో చేరడంతో కాకినాడ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి మాధవపట్నం గ్రామం వద్ద వరద జలాలు మెయిన్ రోడ్డు మీద ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే గోతుల మయంగా మారిన ఈ రహదారి జలాలతో నిండుకోవడంతో గోతులు కనిపించక ప్రయాణికులు ప్రమాదవసత్తు అదుపుతప్పి గోతుల్లో పడుతున్నారు.

పలువురికి ఆర్థిక సాయం

కొత్తపేట : ఇటీవల అనారోగ్యంతోను, మతిచెందిన కుటుంబాలను ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన పట్టా రాజు కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20 వేల సాయం అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలిసిస్ చేయించుకుంటున్న వానపల్లి శివారు కోతుల తోటకు చెందిన గుత్తుల సాయిని రూ.10 వేల సాయం అందచేశారు.

నేడు బోస్ అనుచరుల సమావేశం

ప్రజాశక్తి రామచంద్రపురం



వివరాలు వెల్లడిస్తున్న వైసిపి నాయకులు

రామచంద్రపురం నియోజకవర్గ ఎంఎల్ఎ, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ విధానాలకు వ్యతిరేకంగా వైసిపి కార్య కర్తలు సమావేశమవుతున్నారు .ఈ మేరకు ఆదివారం ద్రాక్షారామ సాయి మాధవ ఫంక్షన్ హాల్ లో సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దొంగా శ్రీధర్ విలేకరుల తో మాట్లాడారు.గత నాలుగేళ్లుగా కార్యకర్తలకు అనేక అవమానాలకు గురయ్యారని అన్నారు. బోస్ దయతో గెలిచిన వేణు బోస్ నుకలిసే కార్యకర్తలను పలు విధాలుగా వేధిస్తున్నారని వారిపై తప్పుడు కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామంతా వైసిపికి వ్యతరేకం కాదని కేవలం మంత్రి వేణు కు వ్యతిరేకమన్నారు. ఆయనను వ్యతిరేకించే వందలాది మంది ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంత సంతోషం, పోలినాటి ప్రసాద్, డి.బాల పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఆలమూరు

సీజనల్ వ్యాధులపై రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని వైద్యాధికారులు పి.భవానిశంకర్, ఆర్.సుదర్శన్ బాబు, డి.మల్లికార్జున, డి.సువర్చలానాయుడు అన్నారు. పెద్దపళ్ల, చొప్పెల్ల పిహెచ్సి ఆరోగ్య పర్యవేక్షకులు పివి.రమణారావు, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వారి పర్యవేక్షణలో శనివారం మండలంలోని పలుగ్రామంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఏఎన్ఎం, ఆశావర్కర్లు సహకారంతో స్థానిక ప్రజలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులతో పాటుగా కుష్టు వ్యాధి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రత అలవాట్లపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా మలేరియా,డెంగ్యూ రెండూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులని, ఇవి మరే ఇతర వ్యాధి లేని విధంగా ప్రజలను భయపెడుతున్నాయన్నారు. దోమల సమూహాలు అపరిశుభ్రమైన ఇళ్లకు చేరుకుని భయాందోళనలకు గురిచేస్తాయన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మురికి నీటి నిలవలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచఒ పి. వెంకటరత్నం, రాధాకృష్ణ, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ కెఎల్.రావు జయంతి

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్టియుకె ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవనంలో శనివారం పద్మభూషణ్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు 122వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విసి జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ భావి ఇంజనీర్లు కెఎల్.రావును మార్గదర్శకంగా తీసుకుని దేశ సర్వతోముఖాభివద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లోనే ఆయన తన ప్రతిభను చాటి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికారన్నారు. నిర్మాణ రంగంలో కె.ఎల్.రావు చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీరామారావు, ఆర్ఎస్ఐఇఎకె ప్రెసిడెంట్ ఇంజనీర్ ఎస్.కృష్ణారావు, పి.ప్రసాద్, ప్రొఫెసర్ ఎం.రమేష్, వి.జయప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన

ప్రజాశక్తి -కరప

విద్యార్థులకు మానసిక ఒత్తిడి జయించడం తదితర అంశాలపై జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి అవగాహన కల్పించినట్లు డాక్టర్ క్రాంతి సౌజన్య తెలిపారు. వేళంగి హైస్కూల్లో శనివారం జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి, లైఫ్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ లెర్నింగ్, డెసిషన్ మేకింగ్‌కి సంబంధించి అంశాలను విద్యార్థులకు వివరించారు.

పిజి సెట్‌లో 'వెంకటేశ్వర' విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పి.జి.సెట్ 2023 ఫలితాలలో స్థానిక శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు స్టేట్ టాప్ ర్యాంక్ లు సాధించినటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ టాప్ ర్యాంకర్లను కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ కెఎస్‌విఎన్.మనోహర్, ఎఒ కరాటం ప్రవీణ్, ఛైర్‌పర్సన్ మల్లిపూడి విజయ లక్ష్మి, ఆఫీసర్స్ కె.శ్రావణ్ దిలీప్, డా.కె.హేమావిజిత, సీనియర్ లెక్చరర్లు, పలువురు ప్రముఖులు అభినందించారు.

యానాం రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలి

ప్రజాశక్తి-కాజులూరు

యానాం ద్రాక్షారామ రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. శనివారం ఉప్పుమిల్లి కుయ్యేరు కొలంక పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వాహనదారులు మాట్లాడుతూ ఈ రహదారిలో నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని దీనికి ప్రధాన కారణం మద్యం సేవించడమేనని వారన్నారు. నిత్యం రాజమహేంద్రవరం, రామచంద్రపురం మండపేట పరిసర ప్రాంతాల నుంచి యువకులు ముగ్గురు నలుగురు ఒకే బైక్‌పై వచ్చి యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండడంతో అడ్డూ అదుపూ లేకుండా మద్యం సేవించి తాగుతూ పరిసర ప్రాంత వాళ్లని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శని ఆదివారాల్లో వీరికి అడ్డూ అదుపూ లేకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని కోరుతున్నారు.

గ్రామీణ విత్తన ఉత్పత్తిపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-అయినవిల్లి

మాగం గ్రామం రెండో నెంబర్ కాలవ గట్టు వద్ద రైతులకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పై శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వై శోభ అధ్యక్షత జరిగింది జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ సహాయకులు రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ఈ పథకనికి ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఫౌండేషన్ విత్తనాలను రైతులకు అందిస్తుందన్నారు. దీని ద్వారా రైతులు తమ విత్తనాలను తామే తయారు చేసుకోవాలన్నారు. విత్తనానికి విత్తన శుద్ధి చేసుకోవాలని విత్తన శుద్ధి ద్వారా శ్రమించే వ్యాధులు మరియు తెగులను కొంతవరకు నివారించవచ్చునని అన్నారు. నారుమడులలో ఎరువుల యాజమాన్యం పురుగులు, తెగుళ్ల సోకకుండా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మ నుంచి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి పాల్గొని పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఎఒ మనోహర్, విహెచ్ఎ జీవనసుధ రైతులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గానికి సంబంధించి గహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు సంస్థ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ శనివారం చెక్కులు పంపిణీ చేశారు. మూడు విడతలకు సంబంధించి 53 మంది లబ్ధిదారులకు సుమారు రూ.58 లక్షల 80 వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

ఉషారాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

యానాం డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్‌గా వినకోటి ఉషారాణి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రజాపనుల శాఖలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి రత్న ఘోష్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఉషారాణి మర్యాదపూర్వకంగా ఆర్ఎఒ మునిస్వామిని కలిశారు.

ఘనంగా విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

పెరుంతలైవర్ కామరాజర్ జయంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలోని విద్యార్థుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వరుగు భాస్కర్ రెడ్డి, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

కో-ఆపరేటివ్ సిబ్బంది దీక్ష విరమణ

ప్రజాశక్తి - యానాం

కో ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది తమ 30 నెలల బకాయి వేతనాల కోసం చేపట్టిన దీక్షను శనివారం విరమించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ యానాం అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, రాష్ట్ర బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు సిబ్బందికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఐదు రోజులుగా పుదుచ్చేరి ఉన్నతాధికారులు, నాయకులతో మాట్లాడుతున్నానని త్వరలో సమస్యలు పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. శనివారం దీక్షా శిబిరం వద్ద పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఐదు రోజులు ఆందోళనకు తమకు సంఘీభావం తెలిపిన అందరికీ కృజ్ఞతలు తెలియజేశారు.